# చిట్టారం సింహం విదేశయాత్ర

చెప్పులోని రాయి బాధ, చెవిలోని జోరీగ గోల అంతగా అనుభవం లేదు కాని, ఇంటిలోని పోరు గురించి మాత్రం వేమన కంటె చాలా బాగా తెలుసు కోటయ్య మంత్రిగారికి.

నరసప్ప మంత్రిగారి తమ్ముడు మలేషియా వెళ్ళి వచ్చినప్పట్నుంచీ, కోటయ్యగారి భార్య తన తమ్ముడిని కూడా ఫారెను పంపించాలని పోరు పెడుతోంది.

'ఈడికేం వొచ్చే! ఓ అంటే డం రాదు' అన్నారు కోటయ్య మంత్రిగారు.

'నరసప్పగారి తమ్ముడి కేవొచ్చని ఆడిని ఫారెను పంపించారు? ఆడు అ నుంచి క దాకా తెలుగచ్చరాలన్నీ తప్పుల్లేకుండా రాస్తే నా చెవి తెగ్గోయించుకుంటా. కవిత్వమంటే అదేదో స్వీటనుకుని రెండు కేజీలు పట్రా అనే రకం. అలాంటెదవని తెలుగు సబలని చెప్పి ఫారెను పంపించలే? అలాగే ఈడినీ ఫారెనంపించు. నీకేం వొచ్చని నువ్వు మంత్రివయ్యావంటా' అని కోటయ్యగారి మీద విరుచుకు పడింది ఆవిడ.

మరి భరించలేక ప్రైవేట్ సెక్రటరీని పిలిచారు కోటయ్య మంత్రిగారు. 'మా బామ్మర్దెదవని అర్జెంటుగా ఫారెనంపించాలి. నువ్వు వాకబు చేసి, ఎక్కడికెలా పంపడానికి వీలవుద్దో చెప్పు. ఎవరితో మాట్లాడాలంటే ఆళ్ళతో మాట్లాడతాను. రష్యాకి సౌహార్ద పర్యటనో, అమెరికాకి వైజ్ఞానిక పర్యటనో, దేంట్లో దాంట్లో మనోణ్ణి తోసెయ్యాలి. నీకు తెలీందేవుంది?' అంటూ ఇంట్లో పోరు గురించి మనసు విప్పి చెప్పేశారు.

'మరో మాట, నీకు తెలుసున్నదే అనుకో, మనుద్యోగం తుమ్మితే ఊడిపోయే ముక్కులా ఉంది. అందుచేత ఇది అర్జెంటు' అని కూడా హెచ్చరించారు.

పి.యస్.గారు చాకులాంటి వారు. పార్టీలు విరిగినా, మంత్రి వర్గాలు కూలిపోయినా, ఆ కొమ్మ విరిగితే ఈ కొమ్మమీదికి, ఈ చెట్టు కూలిపోతే ఆ చెట్టు మీదికి ఎగిరే కోతిలా, ఇరవై ఏళ్ళనుంచి ఏదో మంత్రిని ఆశ్రయిస్తూ అనుభవం గడించి, ఏ డొంక కదలాలంటే ఏ తీగ ఎలా లాగాలో తెలిసినవారు. వారం రోజుల్లో కోటయ్య మంత్రిగారికి ఓ వార్త మోసుకొచ్చేశారు.

'బాంకాక్‌లో, ఆసియా బాక్సింగ్ పోటీలు జరుగుతున్నాయి సార్! దానికి మన బామ్మర్దిగారిని పంపిద్దామా?'

'బాంకాక్ ఫారెన్లోనే ఉందా?'

'ఫారెన్లోనే ఉంది'

'అయితే పంపించేద్దాం'

'మరి మన బామ్మర్ది గారికి బాక్సింగు వచ్చా?'

'బాక్సింగంటే ఏంటి?'

'డిషుం... డిషుం...'

'అమ్మో! దానికి ఆడు గనుడే! మా గ్రేమానికి సింహం లాంటోడు'

మల్లెపువ్వులాంటి లాల్చీ, పైజామా వేసుకుని, గిరజాల జుట్టుకి వాసన నూనె రాసి దువ్వి, నల్లటి నాపరాయిలాంటి శరీరం మీద మెడలో పులిగోరు పతకం పచ్చగా మెరుస్తుండగా, రొమ్ము విరుచుకుని రాజ్యవంతా చెడతిరిగే చిట్టారం సింహానికి బాక్సింగంటే ఏవిటో తెలియనే తెలియదు.

'మరేం పర్లేదు బామ్మర్దీ! మనోళ్ళు ఎక్కడికెళ్ళినా ఓడిపోయొచ్చేదే గాని మెడలు కొట్టుకొచ్చేది లేదుగా! ఆ ఓడిపోయేదానికి నువ్వెడితే ఏంటి? మరో ఎదవైతే ఏంటి? నువ్వే ఎళ్ళు. అవతలోడు, నీ మీదకు రాగానే డాంమని కిందడిపో. ఒకటి, రెండూ అని రిఫరీవాడు పదంకెలు లెక్కెట్టేదాకా సచ్చిన శవంలా లేవొద్దు. ఆడు అంకెలు లెక్కెట్టి ఈలేశాక లేచొచ్చేసే' – కోటయ్య మంత్రిగారు బామ్మర్దికి సలహా ఇచ్చారు.

తరువాత ఆలిండియా బాక్సర్స్ ఎసోసియేషనొకటి పెట్టి (హెడ్డాఫీసు: చిట్టారం బ్రాంచి : న్యూఢిల్లీ), దానికి బామ్మర్ది గారిని ప్రెసిడెంటు చేసి, అది ఏడాదికోసారి జరిపే పోటీల్లో వరసగా నాలుగేళ్ళు ఆయన్ని ఛాంపియన్ చేసేసి, తిమ్మిని బమ్మి చేసి, బమ్మిని తిమ్మిచేసి, బామ్మర్ది.గారిని దండలేసి విమానం ఎక్కించేశారు.

బాంకాక్‌లో బాక్సింగు పోటీలైన తర్వాత, సింగపూర్, టోకియోలమీదుగా అమెరికా వెళ్ళి, ప్రపంచ ఛాంపియన్ మహమ్మదాలీతో బాక్సింగు క్రీడ గురించి సంభాషణలు జరిపి, మాస్కో, రోమ్, పారిస్, లండన్, కైరోల మీదుగా తిరిగి ఇండియా వస్తారు... అదీ బామ్మర్ది గారి కార్యక్రమం.

హుషారుగా విమానమెక్కేసిన బామ్మర్ది గారికి పాపం పొంచి ఉన్న ప్రమాదం గురించి తెలియనే తెలియదు.

విమాన కన్యతో తెలుగులో మాట్లాడి, ఆ అప్సరసకి తెలుగు అర్థం కాకపోతే తెలుగు అంతర్జాతీయ భాష కానందుకు చికాకుపడి, మాటలాడ్డానికి మరో భాష రాక సైగలతో 'డ్రింకు', 'డ్రింకు' అని దారి పొడుగునా వేధించి బాంకాక్‌లో దిగారు, బామ్మర్దిగారు.

నాలుగో రౌండ్‌లో ఇండియాకి, జపానుకి పడింది.

'మిస్టర్ పీచ్ యా ఆఫ్ ఇండియా! ప్లీజ్ గెట్ రెడీ' అని మైక్‌లో ఎనౌన్సర్ గొంతు చించుకు అరిచిన తరవాత, గ్లోవ్సు తొడుక్కుని రంగంలో దిగింది చిట్టారం సింహం.

కండలు తిరిగి చూడ్డానికి పులిలా కనిపించేసరికి ప్రేక్షకులంతా కరతాళ ధ్వనులు చేశారు. బాంకాక్‌లో ఉన్న భారతీయులు, త్రివర్ణ పతాకాలూపుతూ, 'ఇండియా... ఇండియా...' 'పిచ్చయ్యా... పిచ్చయ్యా...' అని పాడసాగారు.

ఆ లైట్లు, ఆ జెండాలు, ఆ హర్షధ్వానాలు, అన్నీ చూసేటప్పటికి బామ్మర్ది గారి ఛాతీ పొంగింది. ఆయన రింగులోంచే ప్రేక్షకులకేసి చెయ్యి ఊపారు, చిరునవ్వు నవ్వుతూ.

'మిస్టర్ నకాసాకి ఆఫ్ జపాన్...'

ఎనౌన్సర్ పిలవగానే జపాన్ ఛాంపియన్ కూడా రంగంలో దిగాడు. వాడు బలంగానే ఉన్నా పొట్టిగా, సన్నంగా, బామ్మర్ది గారితో పోల్చి చూస్తే, పిచికలా ఉన్నాడు.

బామ్మర్దిగారికి వాణ్ణి చూస్తే నవ్వొచ్చింది.

'వీడా ఛాంపియను? రాజబాబులా మొహం, వీడూను' అనుకున్నాడు. అనుకోవడమే కాదు – 'ఈణ్ణి మనమో దెబ్బ కొట్టి, చిత్తుచేసి, గోల్డు మెడలట్టుకు పోతే' అనే ప్రమాదకరమైన ఆలోచన కూడా వచ్చింది.

'రా... రా... రాజబాబూ... చిట్టారం చేగోడీ తిందువుగాని' అన్నాడు బామ్మర్ది ఛాతీ పొంగించి.

రాజబాబు ముందుకి రాలేదు. మెల్లిగా వంగి నేలను తాకి, 'హాయ్... హాయ్... షు... షు....' అని వాడి భాషలో దేవుణ్ణి ప్రార్థించాడు.

'గట్టిగా పేర్థించరోయ్! కాళ్ళూ చేతులూ ఓల్ మొత్తం ఇంటికి చేరుకోవాలని...' అని నవ్వుకున్నాడు బామ్మర్ది.

రిఫరీ విజిలేశాడు.

పోటీ ప్రారంభమైంది.

రాజబాబు తల కొంచెం వంచి, కళ్ళు చికిలించి, క్షణంపాటు బామ్మర్ది గారి కేసి చూశాడు. బామ్మర్ది గారు నిండుకుండలా, తొణక్కుండా అలాగే నవ్వుతూ నిలబడ్డారు.

అంతే...

రాజబాబు ఓ కేకవేసి, తూనీగలాగా ఎగురుతూ వచ్చేసి, రెండు చేతులతో బామ్మర్ది గారి మొహం మీద గుద్దేశాడు. చేతులడ్డం పెట్టుకోడంరాని బామ్మర్దిగారు కోటయ్యగారి సలహా గుర్తుకు రాకుండానే ధాంమని నేలమీద పడిపోయారు, 'సంపేశాడు రోయ్' అంటూ.

రిఫరీ, బామ్మర్ది పక్కన చేరి, 'ఒన్.... టు... ' అని లెక్క పెట్టడం ప్రారంభించాడు.

బామ్మర్దిగారి పైన ఆడిటోరియం కప్పు గిరగిరా తిరుగుతోంది. కిందనేల భూకంపం వచ్చినట్లు ఊగుతోంది. పైన లైట్లు వెలిగి ఆరుతున్నాయి.

'ఈడు పదంకెలు లెక్కెట్టే లోపున నేను సచ్చేపోతాను బావోయ్' అని ఏడుపొచ్చేసింది. 'ఇంక లెక్కెట్టడం సాలు! డాట్టర్ను పిలవండ్రోయ్!' అని చెబుదామనుకుని లేస్తూ, 'అయ్యో! నా తలేవైంది?' అనుకున్నాడు బామ్మర్ది.

మెడ మీద, తలకాయ బదులు ఏదో గుమ్మడికాయ ఉన్నట్టుగా ఉంది బామ్మర్ది గారికి. అదేవిటో చూద్దామని రెండు చేతులు పైకెత్తగానే, అందుకోసమే కాసుక్కూర్చున్న జపానువాడు బామ్మర్దిగారి ముక్కుమీద మళ్ళీ టపటపలాడించేశాడు.

రిఫరీ నిట్టూర్చి, మళ్ళీ 'ఒన్... టు...' అని లెక్క పెట్టడం మొదలు పెట్టాడు.

'మళ్ళీ ఒన్నంటాడు. టెన్నెప్పుడౌతుందిరా దేవుడోయ్' అని గొల్లుమన్నాడు బామ్మర్ది. కాని, నోరు మెదిపినా, తల కదిపినా, జపానువాడు మళ్ళీ మీద పడిపోతాడేమో నని ప్రాణభయంతో, శవంలా బిగుసుకుపోయి పడుకున్నాడు బామ్మర్ది.

ఆ పది సెకండ్లలోనూ నరసప్ప మంత్రిగారిని, ఆయన తమ్ముడిని, తెలుగు మహా సభలని, దేవుణ్ణి, దేశాన్ని (జపానువాణ్ణి తప్ప) వరసగా గుర్తుకు తెచ్చుకుని, మనసులోనే బండబూతులు తిట్టాడు బామ్మర్ది.

ప్రపంచ పర్యటన రద్దు చేసుకుని, మాతృదేశానికి తిరిగి వచ్చిన బామ్మర్ది గారిని విమానంలోంచి స్ట్రెచర్ మీద మోసుకొస్తుంటే చూసి, కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు కోటయ్య మంత్రిగారు.

బామ్మర్ది కన్ను ఒకటి వాచి మూసుకుపోయింది. రెండు మూడు పళ్ళు ఊడిపోయి మూతి ఆంజనేయస్వామి వారి మూతిలా అయింది. ముక్కు పచ్చడై పోయి జపానువాడి ముక్కులా తయారయింది.

బావగార్ని చూడగానే ఒంటి కన్నులో నీరు చిమ్మింది బామ్మర్దికి.

'ఏంట్రా బామ్మర్దీ? ఏవైంది?'

'బర్మ....'

'బర్మావోడు కాదురా... ఆడు జపానోడంట'

'బర్మ... బర్మ....' అని మళ్ళీ అని నుదుటిమీద రెండుసార్లు కొట్టుకున్నాడు బామ్మర్ది. ముక్కు తప్పడయి, పళ్ళూడి, మూతి వాచి, మాట స్పష్టంగా రావడం లేదు బామ్మర్దికి.

బామ్మర్ది సైగ అర్థం చేసుకుని, 'కర్మా?' అన్నారు కోటయ్య మంత్రిగారు.

అవునన్నట్లు తల కదిపాడు బామ్మర్ది.

'నే సెప్పింది మరిసి పోయావా? ఢాం మని కిందడిపోలే?'

'బర్మ... బర్మ...'

'బియ్యం బస్తాలా సుబ్రంగా ఉండేవోడివి. ఎదవ ఎలా సితకబొడిసేశాడురా'

'సార్! మన బామ్మర్దిగారిని ప్లాస్టిక్ సర్జరీకి అమెరికానో, రష్యానో పంపిద్దామా?' కోటయ్య మంత్రిగారి కూడానే నీడలా ఉండే పి.యస్. గారు అడిగారు.

ఆయన మూసుకుపోయిన కన్ను వైపు నిలబడి ఉండడం వలన, బామ్మర్దిగారికి అంతవరకు కనిపించలేదు. ఒంటికన్ను బలవంతంగా అటు తిప్పి, పి.యస్. గారిని చూశారు బామ్మర్దిగారు. ఆయన్ని చూడగానే, ఆయన అన్న మాటల అర్థం బోధపడింది. బాంకాక్ పంపించడంలో ఆయన పాత్ర గుర్తుకు వచ్చి, కరెంటు షాక్ తగిలినట్లు స్ట్రెచర్ మీద బామ్మర్దిగారు ఎగిరి పడ్డారు.

'బాగో'

'ఏంట్రా బామ్మర్దీ? ఇక్కడే ఉన్నా'

'ఆడు అపోజిష డోడ్డ ఏడెండు బాగోయ్' - పి.యస్. గారిని చూపిస్తూ గొల్లుమన్నాడు బామ్మర్ది - 'దడ్డు ఫారెడంపించి సంపేలడి సూస్తూడ్డాడు బాగోయ్'.

'నువ్వు అపోజిషనోళ్ళ ఏజెంటేంటి? ఫారెనంపించి సంపేయాలని సూడ్డవేంటి? ఈడి బ్రెయినేవైనా ఎఫెక్టిచ్చిందంటావా సెక్రటరీ?' అన్నట్లు పి.యస్.గారికేసి చూసి, 'సస్తే మనూళ్లోనే సద్దువుగాని కాని నిన్ను ఫారెనంపించనురా బామ్మర్దీ! బెంగెట్టుకోకు' అని బామ్మర్దికి ధైర్యం చెప్పి, నడిచారు కోటయ్య మంత్రిగారు.

'బతికుంటే మదూడ్లో బలుసాగు తిడొచ్చు. ఇంక ఫారెడొద్దు బాబోయ్' అనుకుంటూ స్ట్రెచర్ మీద కోటయ్య మంత్రిగారిని ఫాలో అయ్యారు బామ్మర్దిగారు.

స్ట్రెచర్ వెనక, సంతాపసూచకంగా తలలు వంచి, పి.యస్. గారూ, మిగిలిన పరివారం నడిచారు.

*(ఆంధ్రప్రభ వారపత్రిక, నవంబరు 21, 1984)*